epaper.telugurekhamedia.com TELUGU REKHA TELUGU DAILY

# తెలుగు రేఖ

సంపుటి : 01 సంచిక : 219 పేజీలు : 4 వెల : రూ. 2.00

తెలుగు దినపత్రిక

శనివారం 18 అక్టోబర్ 2025 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853




## పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



### ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైనవసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

### విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్ తెలుగురేఖ అక్టోబర్ 17:** సమీక్షలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైనవసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయండి. తొలి దశలో ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ పై దృష్టి సారించండి. ప్రతీ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలి ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలి ఇందుకు విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించండి సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించండి నర్సరీ నుంచి 4 వ తరగతి వరకు నూతన స్కూల్స్ ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయండి విద్యార్థులకు పాలు, బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి 2026 జూన్ లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్ తో ముందుకెళ్లాలి. హాజరైన ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి, ఉన్నతాధికారులు.



## ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డులు




రాష్ట్రపతి ముర్మునుంచి అవార్డు అందున్న సెక్రటరీ గౌరవ్ ఉప్పల్

2 లో..



## భూపరిపాలనలో మరో ముందడుగు
## ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

### 19న ముఖ్యమంత్రి చేతులమీదుగా లైసెన్సుల పంపిణీ

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ అక్టోబర్ 17 తెలుగురేఖ:** తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామపాలనాధికారులు ( జీపీవో) ను అందుబాటులోకి తీసుకురాగా తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

2 లో..

## నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

### యూసుఫ్ గూడ నుంచి భారీ ర్యాలీతో రాక

### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్



2 లో..

## ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా

### అయినా తనను పక్కన పెడుతున్న పార్టీ

### మరోమారు అక్కసు వెళ్లగక్కిన రాజగోపాల్



2 లో..

## స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

### ప్రభుత్వం, ఇసిని ప్రశ్నించిన హైకోర్టు

### గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా



**హైదరాబాద్,అక్టోబర్17( తెలుగురేఖ):** తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసు కుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న

2 లో..

## గన్ కల్చర్ తెచ్చిందే బిఆర్ఎస్

- అబద్దాలతో హరీష్ రావు దిగజారిపోతున్నారు
- హరీష్ రావు వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్ 17 తెలుగురేఖ** మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ఆరోపణలపై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె,క్యాబినెట్ సమావేశంపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని

2 లో..

## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

- సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్17( తెలుగురేఖ):**



కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ. 8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా

2 లో..

## బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

### బిల్లును అడ్డుకోవడం వల్లనే బిసి బంద్

### బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే

### దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి


### బిజెపిని డిమాండ చేసిన డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,అక్టోబర్17( తెలుగురేఖ):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు




2 లో..

## రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా గన్ కల్చర్



- పూర్తిగా తగ్గిపోయిన పెట్టుబడులు
- రాష్ట్రానికి రావాలంటేనే భయపడుతున్న పరిశ్రమలు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్17( తెలుగురేఖ):** రేవంత్ రెడ్డి హయాంలో పెట్టుబడులు తగ్గడంతో పాటు, తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నివేదికల ప్రకారం తమ హయాంలో కన్నా పెట్టుబడులు

2 లో..

## రైతు కండ్లలో ఆనందం నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- రైతులు సన్నధాన్యాన్ని పండించాలి
- రాష్ట్రంలో అత్యధిక ధాన్యం పండించే జిల్లాలలో నల్గొండ 2వ స్థానం
- చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించే బాధ్యత నాది
- ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాదు..పేదవాడి కడుపు నింపాలనే సదుద్దేశంతో సన్న బియ్యం ఇస్తున్నాం
- 10,500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా హ్యామ్ విధానంలో నాణ్యమైన రోడ్లు
- రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో 72 గంటల్లో డబ్బులు జమ



**నల్లగొండ అక్టోబర్ 17 తెలుగురేఖ:** ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులను 72 గంటలు జమ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుండి తిప్పర్తి మండలం రామలింగాల గూడెం,అంతయ్య గూడెం,తిప్పర్తి మండల కేంద్రంలోనీ వ్యవసాయ మార్కెట్లో,అనంతరం మామిడాల గ్రామంలో IKP వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు .కంకణాలపల్లి లో నూతన గ్రామపంచాయతీ

2 లో..



## ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు


### వందరోజుల ప్రణాళిక అమలుపై సమీక్ష

### జాలర్లకు మేలు చేసే నిర్ణయాలపై పవన్ ఆరా



**అమరావతి,అక్టోబరు17 ( తెలుగురేఖ):** ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.. మత్స్య సంపద పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు

3 లో..



## ప్రధాని కర్నూలు పర్యటన విజయవంతం

- అధికారులను అభినందించిన సిఎం చంద్రబాబు

**అమరావతి,అక్టోబర్17( తెలుగురేఖ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు జిల్లా పర్యటన విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు

2 లో..

# గన్ కల్చర్ తెచ్చిందే బిఆర్ఎస్

ఖండించారు. "నా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి చెబుతున్నా.. నన్ను కన్న సమ్మయ్య, సమ్మక్క సాక్షిగా చెబుతున్నా.. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి రాద్ధాంతం జరగలేదు. ప్రజల సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపైనే చర్చ జరిగింది. హరీష్ రావు చెప్పిన ఒక్క మాటలో కూడా నిజం లేదు" అని సీతక్క స్పష్టం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, హరీష్ రావు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "క్యాబినెట్లో రాద్ధాంతం జరిగిందని చెబితే దానికి సాక్ష్యం చూపగలడా? జరగని విషయాలను జరిగాయని చెబుతూ ఆయన దిగజారిపోయారు. ఇంత దిగజారి మాట్లాడడం ఆయనకి తగదు" అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో గన్ కల్చర్ తెచ్చిందీ బీఆర్ఎస్ పార్టీనే అని సీతక్క ఆరోపించారు. "ఇబ్రహీంపట్నంలో రియల్ ఎస్టేట్ గొడవల్లో తుపాకులతో కాల్పులు జరిపితే ఇద్దరు చనిపోయారు. హరీష్ రావు నియోజకవర్గమైన సిద్దిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో కాల్పులు జరిపి రూ.43 లక్షలు ఎత్తుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉండగానే అడ్వకేట్ వామనరావు దంపతులను నరికి చంపారు. అవినీతికి, అబద్ధాలకు, అహంకారానికి నిలువెత్తు నిదర్శనం బీఆర్ఎస్" అని సీతక్క మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రులకు మాట్లాడే స్వేచ్ఛే లేదని, అంతా పంజరంలోని చిలుకల్లా ఉన్నారని గుర్తుచేశారు. "కానీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి గారు మంత్రులకు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి. కానీ గతంలో కెసిఆర్ హయాంలో క్యాబినెట్ సమావేశాలు నామమాత్రంగానే జరిగేవి" అని ఆమె అన్నారు. హరీష్ రావు ఇప్పుడు గుమస్తా తెలంగాణ పత్రిక అబద్ధపు కథనాలను అమ్మే సేల్స్‌మెన్‌గా మారిపోయారని సీతక్క విమర్శించారు. "క్యాబినెట్లో కొట్లాటలేదని స్పష్టంగా చెబుతున్నా. అబద్ధపు వార్తలు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు కానీ అవి అమ్ముడు కావడం లేదు. బీఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు నాలుగు స్తంభాలాట నడుస్తోంది. అదే కారణంగా కేసీఆర్ ఫాం హౌస్ నుంచి బయటకు రావడం లేదు" అని అన్నారు. "మీ అవినీతికి సజీవ సాక్ష్యం కాళేశ్వరం ప్రాజెక్టే. కెసిఆర్ కూతురు కవిత చేసిన అవినీతి ఆరోపణలకు ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు. అవాస్తవాలతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తే ప్రజలే త్వరలో మీకు తగిన బుద్ధి చెబుతారు" అని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా

**నల్లగొండ,అక్టోబర్17( తెలుగురేఖ):**

మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతపార్టీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని, కానీ పార్టీ తనను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని, తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, అతని కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారని మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడిన నన్ను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఎక్సైజ్ నిబంధనలకు తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే సొంత నిబంధనలు ఖరారు చేయడం మునుగోడు నియోజకవర్గంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిబంధనల పేరుతో జారీ చేసిన అంశాలపై సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన స్పందిస్తూ కేవలం ప్రజలకు మేలు చేసేందుకే అని అన్నారు. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని,వైన్ షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించారు . మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. వైన్ షాప్‌లు ఊరి బయట మాత్రమే పెట్టాలని,వైన్ షాప్ కు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఉండవద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని , లాటరీ విధానంలో వైన్స్ షాప్ లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదని పేర్కొన్నారు.ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్‌ల నిర్మూలన, మహిళల సాధికారతే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

# నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

**హైదరాబాద్,అక్టోబరు17 ( తెలుగురేఖ):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్ యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్స్లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

# ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డులు

**న్యూఢిల్లీ,అక్టోబర్17( తెలుగురేఖ):**

ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరపున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు – ఖఓ–ఏంఔఓంఔ, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేష్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# రైతు కండ్లలో ఆనందం నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

భవనాన్ని ప్రారంభించారు. మర్రిగూడెం లో నూతన రేషన్ షాపును ప్రారంభించి, లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. అదేవిధంగా తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యాన్ని తరలించే లారీలను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మాట్లాడుతూ రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూడడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అందుకే ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించేందుకుగాను 25వేల కోట్ల రూపాయలను క్యాబినెట్ కేటాయించినట్లు వెల్లడించారు. రైతులు ధాన్యం అమ్మిన డబ్బుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదని, 72 గంటల్లో వారి ఖాతాలలో జమ చేస్తామని, ఒకవేళ డబ్బులు జమ కాకుంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా అత్యధికంగా ధాన్యం పండించే రెండవ జిల్లాగా నిలిచిందని, అయితే రైతులు సన్న ధాన్యాన్ని ఎక్కువగా పండించాలని, ఈ దిశగా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ధనవంతుల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెడలందరికి రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నదని, అందువల్ల సన్నబియాని ఎక్కువగా పండించాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో 75% సన్న బియ్యం పండిస్తున్నారని, అందువల్ల నల్గొండ జిల్లాలో సైతం సన్నబియ్యనికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా ఆర్ అండ్ బి శాఖ ద్వారా 6600 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేపట్టామని,10,500 కోట్ల రూపాయలతో 5,500 కి.మీ హ్యామ్ విధానంలో రోడ్లకు నిన్న క్యాబినెట్ అనుమతి తీసుకున్నామని త్వరలోనే టెండర్లు పిలిచి జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు,గ్రామాల నుండి మండలాలకు సింగిల్ రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ఇందుకు క్యాబినేట్ కూడ అనుమతించడం జరిగిందని ఆయన వెల్లడించారు. రహదారి, రవాణా సౌకర్యం బాగున్నప్పుడే రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్ కు తీసుకు వెళ్ళేందుకు వీలు కలుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు 7 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని ,గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యం లారీలకు జండా ఊపి ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధాన్యం మిల్లులు తరలించడం, ట్రాన్స్పోర్ట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,ఇందుకుగాను ట్రాన్స్పోర్ట్ యజమానులు, లారీల యజమానులు సహకరించాలని, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల ద్వారా తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,ఆర్డీవో అశోక్ రెడ్డి,డి ఎస్ ఓ వెంకటేష్,పౌర సరఫరాల డి.ఎం గోపికృష్ణ,డిసిఓ పత్యానాయక్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, పాశం రాంరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడు తున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# భూపరిపాలనలో మరో ముందడుగు.. ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు ..

ఈనెల 19వ తేదీన శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్ ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడం, ఇంకోవైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునికి పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్ తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకోగా తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని ఇందులో 3465 మంది అర్హత సాధించారని తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రెండవ విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించామని ఈనెల 26వ తేదీన జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని వీరి సేవలు కూడా డిసెంబర్ రెండవ వారం నాటికి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

రెవెన్యూ శాఖకు సర్వే విభాగానికి అవినాభావ సంబంధం ఉంటుందని భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుతాయని సర్వే వ్యవస్థ బలపడితేనే ప్రజలకు భద్రత, న్యాయం లభిస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు తగిన సేవలు అందలేదని గుర్తుచేశారు.


ప్రతి రెవెన్యూ గ్రామంలో జీపీవోలు, ఇప్పుడు ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు – ఈ రెండు చర్యలతో ప్రజలకు అవసరమైన భూ సంబంధిత సేవలు అందేలా వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యమని మంత్రి గారు స్పష్టం చేశారు. భూమి రికార్డులు స్పష్టంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బంది లేకుండా, అవినీతి లేని సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని " మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా గన్ కల్చర్

పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. బెదరింపులు, వసూళ్లే ఇందుకు కారణమని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేబినెట్ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు. శు క్రవారం)తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగదీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత జరుగు తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై కేంద్రమంత్రులు



కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదు..? అని నిలదీశారు. మంత్రుల పంచాయితీలు పరిష్కరించడానికే కేబినెట్ సమావేశాలు పెడుతున్నారని సెటైర్లు గుప్పించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కేబినెట్ భేటీలో మంత్రులు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ ఆరడజను వర్గాలుగా విడిపోయిందని దెప్పిపొడిచారు. రాష్ట్ర ప్రభుత్వం అతుకుల బొంతలాగా మారిందని స్వయానా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలోని 23 నెలల్లో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దు కోవాలన్న చందంగా.. కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధుల వాటాలు సాధించామని అన్నారు. హ్యామ్ మోడల్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని హెచ్చరించారు. హ్యామ్ మోడల్ బోగస్ అని.. కమీషన్లు దండుకోవటానికే ఈ మోడల్ తీసుకువస్తున్నారని ఆరోపించారు. దీపావళికైనా హామీలు అమలు చేస్తారని ఎదురుచూసిన ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైందని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రధాని కర్నూలు పర్యటన విజయవంతం

వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రులు, వివిధ శాఖల అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ప్రధాని నాలుగోసారి పర్యటించారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఉద్ఘాటించారు. ఈ సభ మంచి మెసేజ్ ఇచ్చిందని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ పర్యటనలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని ప్రశంసించారు. ప్రధాని మోదీ సైతం పర్యటనను ఎంతో ఆస్వాదించారని పేర్కొన్నారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనంపై ప్రధాని ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారని అన్నారు. ప్రధాని మోదీ సైతం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను అభినందించారని తెలిపారు. జీఎస్టీపై నెల రోజులపాటు చేసిన కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎ÷–లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎ÷–లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎ÷–లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎ÷–లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం..

## కాంగ్రెస్ ముసుగు తొలగుతోంది.!

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. త్వరలోనే అంటే డిసెబర్‌లో రెండేళ్ల వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వంలో,పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అసలురంగు మెల్లగా బయలకు వస్తోంది. అధికారంలో ఉంటే అవినీతి అన్నది దానిచుట్టూ పెనవేసు కుంటుంది. మంత్రుల అవినీతిపై ఊరూవాడా గుసగుసలు ఎక్కువయ్యాయి. బిఆర్‌ఎస్ అవినీతి గురించి తిట్టిపోస్తున్నా... రెండేళ్ల కాలంలో ఒక్కటీ రుజువు చేయలేదు. ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు. ప్రచారం కోసం మాత్రం అవినీతిని వాడుకుంటున్నారు. ఇకపోతే సిఎం రేవంత్ రెడ్డి కూడా తనమానాన తన పనులు చేసుకుంటూ పోతున్నట్లుగా ఉంది. ఇటీవల మంత్రుల మధ్య కులపంచాయితీ మొదలయ్యింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ కుమార్ మధ్య పంచాయితీ సద్దుమణిగిందని అనిపించారు. అడ్లూరి, వివేక మధ్యన కూడా గొడవలు ఉన్నాయి. మంత్రుల్లో ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఇకపోతే బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తరవాత జివో ఇవ్వడం, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసుల వేయడం ద్వారా కాంగ్రెస్ అపరిపక్వ విధానాలు తేటతెల్లం అయ్యాయి. ఓ రకంగా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తూ ముందుకు సాగివుంటే ఇంత పంచాయితీ వచ్చేది కాదు. ఈ విషయంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారు. దీనిపై ఎంతధనం వెచ్చించారో ప్రజలకు చెప్పాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు, లాయర్లు, మంత్రుల ఢిల్లీ పర్యటనల ఖర్చులు తెలియచేసి నిజాయితీ చూపాలి. ఇకపోతే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అనర్హులకు కేటాయించారంటూ పలు జిల్లాల్లో ప్రజలు రోడ్డెక్కి నిలదీస్తున్నారు. కిలో రూపాయికి సన్న బియ్యం దాదాపు అందరికీ ముడుతున్నాయి. అందువల్ల పంచాయితీ రావడం లేదు. దుబారాను ఎలాగూ పట్టించుకోరన్నది తేలింది. ఇకపోతే మంత్రులపై వస్తున్న అవినీతిపైనా చర్చించాలి. కానీ చెప్పడం లేదు. ఇచ్చిన హామీలంటూ అనేకం అమలు చేయలేదు. కనీసం గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న బాధ్యతను కూడా ప్రభుత్వం ప్రదర్శించడం లేదు. వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎక్కడా తట్టెడు మన్ను పోయడం లేదు. ఉద్యోగుల్లో అవినీతి పెరిగింది. డబ్బులు లేనిదే ఫైలు కదలడం లేదు. ఎసిబి నామమాత్రపు దాడులను ఉద్యోగులు లెక్కచేయడం లేదు. ఇక కొత్తగా కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు నడుస్తోంది.ఆమె అవినీతిలో కూరుకుపోతున్న వైనం బాహాటంగా వినవస్తోంది. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తున్నది. దీనికితోడు సిఎం, మంత్రులు తనపై కక్షకట్టారని కొండా దంపతులు, కుటుంబం కూడా ఆరోపిస్తోంది.తాజాగా కేబినేట్‌కు డుమ్మా కొట్టారు. మొన్నటికి మొన్న మేడారం సమీక్షకు కూడా దూరంగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి బుధవారం పరామర్శ పేరుతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరూ హాజరైనా మంత్రి కొండా సురేఖ మాత్రం ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో ఆమె ప్రమేయం లేకుండా ఇన్‌చార్జి మంత్రి పేరుతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుండటం మంత్రి సురేఖకు ఆగ్రహం తెప్పించిందని అంటున్నారు. దీనికి తోడు మేడారం టెండర్ల లీకు వ్యవహారంలో సురేఖ ఓఎస్డీ సుమంత్ పాత్ర ఉన్నదనే అనుమానంతో ప్రభుత్వం ఆయనను ఆ పోస్టు నుంచి తొలగించింది. సుమంత్ కొండా సురేఖ నివాసంలోనే ఉన్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లారు. ఈ పరిణామాలన్నింటి వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారని కొండా సురేఖ కుమార్తె సుస్మితాపటేల్ ఆరోపించారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై సురేఖ చేసిన వ్యాఖ్యల నుంచి ఆమె ఓఎస్డీ తొలగింపు వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలు సంచలనంగా మారాయి. అయితే, ప్రతి ఘటనను తనకు అనుకూలంగా మలచుకున్న కొండా సురేఖ ఈసారి మాత్రం తమను 'రెడ్డి' సామాజికవర్గం టార్గెట్ చేసిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ముసలం పుట్టిందా అన్ని చర్చ సాగుతోంది. ఇన్నాళ్లూ గుట్టుగా సాగిన అవినీతి బయట ప్రజల్లో చర్చకు దారితీస్తోంది. మంత్రుల మధ్య వివాదాలు, కొండా సురేఖ వర్సెస్ పొంగులేటి, మేడారం టెండర్లు.. ఇలా కొన్నిరోజులుగా బయటికి వచ్చినవన్నీ కొన్ని మాత్రమే. కానీ, తెరవెనక అవినీతి అనకొండలు ఉన్నట్టు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంతో బయటపడింది. మేడారం టెండర్ల నేపథ్యంలో మంత్రుల మధ్య విబేధాలు బయటపడినట్టు కనిపిస్తున్నా..ఈ వ్యవహారం కొండా సురేఖ చుట్టే తిరిగిందని ప్రచారం జరుగుతున్నది. సూర్యాపేట జిల్లాలోని సున్నపురాయి గనులను నిబంధనలకు విరుద్ధంగా రెండు సిమెంటు కంపెనీలకు కట్టబెట్టడంతో వచ్చిన ముడుపుల వ్యవహారమని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇకపోతే దక్కన్ సిమెంట్ కంపెనీపై అక్రమ మైనింగ్ వ్యవహారంలో భారీ జరిమానా పడినట్టు సమాచారం. మైనింగ్‌లో గనులతో పాటు అటవీ శాఖకు కూడా సంబంధం ఉంటుంది. కంపెనీల వ్యవహారంపై కొంతకాలం కిందట మంత్రి కొండాకు ఉప్పందడంతో ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలుస్తున్నది. ఈక్రమంలోనే సుమంత్ రంగంలోకి దిగి కంపెనీతో డీల్‌కు ప్రయత్నించాడనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల వల్లే మేడారం పనుల్లో సురేఖను దూరం పెట్టడం, ఓఎస్డీని తొలగించి మంగళవారం రాత్రి కొండా నివాసానికి పోలీసులను ఉసిగొల్పినట్టు స్పష్టమవుతున్నది. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం ఒక్కటే కనిపిస్తున్నా అనేక విధాలుగా అవినీతి గుప్పుమంటోంది. కెసిఆర్‌ను తిట్టిపోస్తూ ...వీరు కూడా అలాగే తయారయ్యారన్న ప్రచారం సాగుతోంది. పనులకు, బిల్లులకు పర్సెంటీజుల లేనిదే రావడం లేదంటున్నారు. కాంగ్రెస్ అవినీతి ఎప్పటికైనా బద్దలు కాక తప్పదని బిఆర్‌ఎస్ ధీమాగా ఉంది. తమ అవినీతి వ్యవహారం ఇక బయటకు రాదన్న భరోసా కూడా ఉంది.

## ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు

చేపడుతున్నామని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలపై శుక్రవారం) పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో వంద రోజుల ప్రణాళిక అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్‌ఆర్‌ఐ), విశాఖపట్నం శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ చర్చించారు. మత్స్యకారుల్లో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించడానికి గల అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు తమ సమస్యలని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి వందరోజుల ప్రణాళిక చేపట్టారు. ఈ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలని అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం, తదితర అంశాలపై విశాఖపట్నం సీఎంఎఫ్‌ఆర్‌ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. యన సూచనలను అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కి పవన్ కల్యాణ్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## భగ్గుమంటున్న బంగారం ధరలు

**- అందనంతగా రోజురోజుకూ పెరుగుదల**

**- ఏకంగా 3వేలు పెరిగిన తులం బంగారం ధర**

**హైదరాబాద్,అక్టోబర్17( తెలుగురేఖ):**

బంగారం భగభగమండుతోంది. సామాన్యులను ఊరిస్తున్న పుత్తడి సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. ఏకంగా రూ.1.40 లక్షల వైపుకు దూసుకెళ్తోంది. ధనత్రయోదశి కి ఒక్కరోజు ముందు బంగారం ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.3 వేలకుపైనే పెరిగింది. ఫలితంగా తులం బంగారం రూ.1.35 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,250గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.1,81,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

## ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- వైద్య ఆరోగ్యశాఖ, సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**- మక్తల్ లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు రాజనర్సింహ, వాకిటి శ్రీహరి**







**మక్తల్ అక్టోబర్ 17 తెలుగురేఖ:**
నారాయణపేట జిల్లా, మక్తల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో ప్రమాణాలతో కూడిన విద్య,మెరుగైన వైద్యం,పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ,సాంకేతిక శాఖ,జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.గత ప్రభుత్వ హయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకి సన్నబియ్యం,నూతన రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా మంజూరు చేస్తోందని తెలిపారు.రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మక్తల్ మండల పరిధిలోని సంఘంబండ (దివంగత చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్) రిజర్వాయర్తో పాటు మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు మిని ట్యాంక్ బండ్ లో చేప పిల్లలను మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి విడుదల చేశారు.అనంతరం రూ.377 లక్షల వ్యయంతో మక్తల్ మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేసి వనమహోత్సవంలో భాగంగా మినీ ట్యాంక్ బండ్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 100 శాతం రాయితీతో 26 వేల చెరువుల్లో 84 కోట్ల చేపపిల్లలు,10 కోట్ల రొయ్య పిల్లలను "ఉచితంగా చేప పిల్లల పంపిణీ" చేస్తున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాళ్ళతో తనకు అవినాభావ సంబంధం ఉందని,తమ ప్రాంతాలు సంగారెడ్డి,జోగిపేట, సదాశివ పేటలో ఆ సామాజిక వర్గానికి చెందిన వాళ్లు ఎక్కువగా ఉన్నారన్నారు. బీసీ సమాజంలో నాయకత్వం ఎదగాలని, తద్వారా వెనకబడ్డ కులాలకు బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందుతుందన్నారు.ఎస్సీ సామాజిక వర్గాల 30 ఏళ్ల పోరాటానికి చరమగీతం పడి వారి వర్గీకరణ కల నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ అని, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. బీసీ సమాజంలో నూటికి నూరు శాతం కమిట్మెంట్ ఉన్న నాయకుడు వాకిటి శ్రీహరి అని ముదిరాజ్ కులంలో పుట్టిన శ్రీహరి ఆ జాతికే గర్వకారణం అని కొనియాడారు. గతంలో ఈ ప్రాంతానికి వచ్చిన సందర్భంగా తన శాఖకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇక పై ప్రతీ 30 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుందని, జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువఉంటుందని,అలాంటి బ్లాక్ పాయింట్ల వద్ద ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని,ఈ ఏడాదిలో డిసెంబర్లో ట్రామా సెంటర్లు అందుబాటులోకి వస్తాయని మంత్రి చెప్పారు. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు 6 నెలల్లో మహబూబ్ నగర్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్, ఎం ఆర్ ఐ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.నారాయణపేట లో 50 సీట్లతో ఇప్పటికే మెడికల్ కాలేజీ అందుబాటులోకి తీసుకొని వచ్చామని, మరో 9 నెలల్లోచికిత్స కోసం హైదరాబాద్ వరకు వెళ్లకుండా గ్రామాల్లోనే చికిత్సా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బీద బడుగు బలహీనర్గాలకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. పక్కన కృష్ణమ్మ పారుతున్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మక్తల్ ప్రాంతానికి నీళ్లు రాలేదనీ, కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ప్రాజెక్టులు తెచ్చారని ఎద్దేవా చేశారు. గత పాలకుల మాటలే తప్ప చేతలు లేవు అన్నారు.గత పాలకులు మైక్ పట్టుకున్న ప్రతిసారి జీవో 69,14 అని కాగితాలు చూపించి మాత్రమే కాలం గడిపారు తప్ప ప్రాజెక్టు పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. ఈప్రాంతం వెనుబాటుతనానికి గురయిందని గుర్తించి , జీవో నెం 69,14 ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని నారాయణపేట- మక్తల్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని కృషి చేస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు.గత ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చివరి అవకాశం కింద నీళ్లు ఇస్తామని జీవో ఇచ్చి కాన్సల్ చేసిందన్నారు.ఈ సందర్భంగా మనం సత్యసాయిబాబాను గుర్తు చేసుకోవాలని75 గ్రామాలకు నీరు అందిస్తూ పైపు లైన్ వేస్తే అలా కాదు మేము ఎక్కువ చదివాం మాకు ఎక్కువ తెలుసని,కాంట్రాక్టర్ల కోసం పక్కనే ఉన్న ప్రాజెక్టు మూసివేసి ఇక్కడ ఉన్న నీళ్లను శ్రీశైలం దగ్గర ఏలూరు దగ్గర బ్యాక్ వాటర్ కి తరలించి అక్కడి నుండి నాగర్ కర్నూలు టు జడ్చర్ల టు మరికల్ నుండి నారాయణ పేట,మక్తల్ కి నీళ్లు ఇచ్చే పరిస్థితి దాపురించిందని, ఎక్కడ ఏ చిన్న పైపు పగిలినా నీటి సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. 30 కిలోమీటర్ల దూరంలో కృష్ణమ్మ నీళ్లు ఇస్తుంటే 330 కిలోమీటర్ల దూరం టెలర్స్ పెట్టడం జరిగిందనీ,కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి కాలువల ద్వారా నీళ్లు ఇస్తాం అని కథలు చెప్పారు తప్ప ప్రాజెక్టు పూర్తి చేయకపోగా నారాయణపేట - మక్తల్ - కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు.ప్రాజెక్టు కోసం భూమి ఇచ్చిన వారిని బి.ఆర్.ఎస్. నాయకులు రెచ్చగొడుతున్నారు.భూ సేకరణలో భాగంగా భూములు ఇచ్చిన వారికి మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఎకరానికి 14 లక్షలు ఉంటే 20 లక్షలు పెంచి ఇచ్చామని తెలిపారు.ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురి కాకుండా మళ్ళీ ఒక భూత్పూర్, నేరెడ్ గాం కాకుండా 94% రైతులు స్వచ్ఛందంగా ఈ ప్రాజెక్టుకు భూమి ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. ఏదైనా శాఖకు మార్చిలో బడ్జెట్ కేటాయిస్తే మళ్ళీ మార్చిలోనే బడ్జెట్ పెంచుతారు కానీ తాను మధ్యలో మంత్రిగా పదవి బాధ్యతలు తీసుకున్న తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపుగా 123 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించడం జరిగిందని తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మత్స్య శాఖ కేటాయించడం దేశంలోనే ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. గతంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయనీ,తాను బాధ్యతలు తీసుకున్న తరువాత మత్స్య శాఖను ప్రక్షాళన చేశానని చెప్పారు.అన్ని చెరువుల దగ్గర చేప గుర్తు వున్న బోర్డు ఏర్పాటు చేసి అందులో చేప రకం,ఎన్ని చేపలు వదిలాం, సంఘం అధ్యక్షుడు పేరు, స్థానిక ఎస్ ఐ పేరు ఫోన్ నెంబర్తో కూడిన వివరాలు ఉంటాయన్నారు. ఈరోజు ప్రారంభం చేసిన చేపల పంపిణీ ద్వారా 5 లక్షల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని, ఈ ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో 255 నీటి వనరులు ఉన్నాయని వాటిలో 94 లక్షల చేప పిల్లలను వదలడం జరుగుతుందని, దీనివల్ల 46 మత్స్య సహకార సంఘాలలోని 4500 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. మక్తల్ పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ బ్యూటిఫికేషన్ పనులు దాదాపుగా 4 కోట్లతో ప్రారంభించామని, ఈ పనులు కూడ అడ్డుకోవడానికి బి.ఆర్.ఎస్ నాయకులు ప్రయత్నం చేశారనీ ఎన్ని అడ్డంకులు ఎదురైనా సుందరీ కరణ పనులను పూర్తి చేసి తీరుతాం అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్ తో బాధ పడుతున్నా సరే చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి వచ్చారని,ఇది వరకే మక్తల్ నియోజకవర్గానికి 2 ఆసుపత్రులు ఆత్మకూరు 22 కోట్లతో నిర్మాణం,మక్తల్ ప్రాంతంలో 42 కోట్లతో నిర్మాణం,2 డయాలసిస్ సెంటర్లు,5 అత్యాధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్స్,అమరచింత మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి 23 మంది వైద్య శాఖ స్టాఫ్ ను మంత్రి దామోదర రాజనర్సింహ కేటాయించారని గుర్తు చేశారు.మన ప్రాంతానికి నిధులు కేటాయించడంలో చొరవ చూపిస్తున్న దామోదర రాజనర్సింహ మన జిల్లాకు ఇన్చార్జి రావడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్, ఎమ్మెల్యేలు డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్, రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయి, మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కాంత్ కుమార్, మత్స్యశాఖ జిల్లా అధికారి రహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో కరుగుతున్న కొండ

**- ఏకాకిని చేసే ప్రయత్నాలు మొదలు**

**- వరుస ఘటనలే నిదర్శనమంటున్న పరిశీలకులు**



**వరంగల్,అక్టోబర్17( తెలుగురేఖ):**
వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయ కుంపటి రగులుతూనే ఉంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు మరింత రోత పుట్టిస్తున్నాయి. తాజా పరిణామాల వెనక ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డేనని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపించారు. తమపై రెడ్డికులాల ఆధిపత్యం రదుస్తోందని ఆమె ఘాటుగానే వ్యాఖ్యానించారు. వీరంతా కలసి తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండుతున్నారు. తమది కాంగ్రెస్ రక్తమని చెప్పుకుంటున్న కొండా సురేఖ మధ్యలో కొన్ని సంవత్సరాలు మాత్రం బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. ఈ క్రమంలో టీడీపీలో పనిచేసి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు తమను టార్గెట్ చేశారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు.వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని గాంధీభవన్ వేదికగా ఆరోపించారు. ఇదే విషయమై అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వరకు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వరకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. మరోవైపు, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుకు వ్యతిరేకంగా కూడా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నిత్యం వార్తల్లో ఉండటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తమది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అని చెప్పడం, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పరిచయాలు ఉండడం, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేరుపెట్టి పిలిచే నాయకురాలిగా పేరు తెచ్చుకోవడంతోపాటు, చెప్పినట్టు వినరనే కారణంతో కొండా దంపతులను రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని వీరు ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి నటుడు నాగార్జున అంశంలోనే సురేఖపై వేటు తప్పదన్న వార్తలు వినిపించాయి. అప్పట్లో ఆమెను తప్పించాల్సిందేనని వైరివర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేసింది.

ఈ ఫిర్యాదుల వెనక కూడా రెడ్డి సామాజికవర్గమే ఉన్నదని, రేవంత్‌రెడ్డి అండ చూసుకుని తమను వేధిస్తున్నారని అప్పట్లో కొండా దంపతులు ఆరోపించారు. ఇక గనుల వ్యవహారానికి వస్తే .. అక్రమాల నేపథ్యంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల జరిమానా విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నోటీసులు పంపింది. ఆ నోటీసులతో బిత్తరపోయిన కంపెనీ యాజమాన్యం పలువురు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్టు సమాచారం. దీంతో బంతి తన కోర్టులోకి వచ్చిందని నిర్ధారించుకున్న ఓఎస్డీ సుమంత్.. కంపెనీ యాజమాన్యంతో బేరసారాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో జరిగిన వ సూళ్ల, పంపకాల తేడాతో వ్యవహారం రచ్చకెక్కినట్టు చెప్తున్నారు. తాజా పరిణామాలపై సురేఖ కూతురు సుస్మిత సెల్ఫీవీడియో ద్వారా అందించిన వివరాలతో తీగ లాగితే హుజూర్‌నగర్‌లోని సున్నపురాయి నిక్షేపాల డొంక కదులుతున్నదని స్పష్టమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరిపారు.

సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్టులో ఎన్‌సీఎల్ అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను తవ్వుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూ గర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ-టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకుకు బిడ్ దాఖలు చేసి మైనింగ్ లీజు దక్కించుకోవడం గమనార్హం. కానీ మిగిలిన రెండు బ్లాకుల జోలికి వెళ్లలేదు. గనుల వ్యవహారంలో రూ.1500 కోట్ల స్కాం జరిగిందని వెంటక్ రెడ్డి అనే వ్యక్తి పేర్కొన్నారు. దీనిపై అతను సమాచారశాఖ ద్వారా ఫిర్యాదు చేస్తే... ఆ ఫిర్యాదును రాష్ట్ర గనుల శాఖకు పంపినట్టు సమాధానం ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మొత్తంగా ఇప్పుడు పార్టీలో కొండా సురేఖ ఏకాకి అయ్యారనే అంటున్నారు. రాజకీయంగా ఆమెను ఒంటరి చేశారని అంటున్నారు.

# బంద్ ఫర్ జస్టిస్..నేడు రాష్ట్ర బంద్

**- బిసి సంఘాలకు అన్ని పార్టీల మద్దతు**

**- బిజెపి లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు**



**హైదరాబాద్,అక్టోబరు17 ( తెలుగురేఖ):** బంద్ ఫర్ జస్టిస్ పేరుతో18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌ఉ మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## భూదాన్ భూములపై హైకోర్టు కీలక నిర్ణయం

**- ఐఎఎస్‌లకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్ కొట్టివేత**




**హైదరాబాద్,అక్టోబరు17 ( తెలుగురేఖ):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం భూదాన్ భూముల వ్యవహారం పై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ ను కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. సర్వే నెంబర్ 194, 195 భూదాన్ భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసి అన్యాక్రాంతం చేశారంటూ పిటిషనర్ తరపున లాయర్ హైకోర్టు వాదించారు. అయితే పిటిషనర్ వాదనలను ధర్మాసనం ఏకిభవించలేదు. ఈ కేసులో ఇంప్లిడ్ పిటిషన్లు , ఇంటర్‌లోక్యుటరీ అప్లికేషన్ పిటిషన్లు కూడా హైకోర్టు కొట్టి వేసింది. మరోవైపు భూదాన్ భూముల వ్యవహారంలో ప్రధాన కేసు విచారణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారంలోని 181, 182 సర్వే నెంబర్‌లో సుమారు 103 ఎకరాలు భూదాన్ భూమి ఉంది. ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. అందులో సుమారు 50 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ 50 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో.. వారు అందులో ఎ÷–లాట్లుగా విభజించి.. విక్రయాలు చేపట్టారు. అయితే ఈ అంశం ప్రస్తుతం హైకోర్టు(÷ఁ్గ÷జీనిణజీనిజీ ఊతిణర అనీబీసబి) కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఈ భూములకు సంబంధించి లావాదేవీలపై కోర్టు స్టే విధించింది. ఇక ఈ అంశంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు.. గతంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు గుర్తించారు.

## జ్యోతి బస్ నగర్ లో అభివృద్ధి పనులు చేసిన అంబేద్కర్ రాజుకు కాలనీ వాసుల ఘన సన్మానం.





**హనుమకొండ, అక్టోబర్ 17 ,తెలుగు రేఖా :** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో, హనుమ కొండ నాలుగో డివిజన్ పరిధిలోని జ్యోతిబసు నగర్ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి. సి.సి. రోడ్లు, డ్రైనేజీలు, ఇందిరమ్మ ఇండ్లు, బాల వికాస వాటర్ ప్లాంట్ వంటి పలు ప్రజావసర పనులు కాలనీ అభివృద్ధికి మైలురాయిగా నిలిచాయి. ఈ కార్యక్రమాలకు ముందుండి కృషి చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజును కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు పుప్పాల చిన్నరాజు, యువజన అధ్యక్షుడు భజన్ శంకర్, కమిటీ సభ్యులు పసుల శీను, పిప్పాల విజయ్, నల్లవేణి లత, పొన్నం లావణ్య, రజిత, బుర్రి రమ, శంకర్, సాగర్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ "అంబేద్కర్ రాజు అన్న ప్రజల మధ్యే ఉంటూ, కాలనీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆయన నిజమైన ప్రజా సేవకుడు" అని ప్రశంసించారు. సన్మాన కార్యక్రమం హర్షాతిరేకంగా సాగి, పాల్గొన్న ప్రజలు ఆయన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని వాసులు ఆకాంక్షించారు. ?

# పంజాబ్ లో గోల్డెన్ టెంపుల్ ను దర్శించుకున్న బండి సంజయ్

**- అమ్రుత్ సర్ లోని బీజేపీ కార్యాలయంలో గడిపిన కేంద్ర మంత్రి**

**- శ్రీనగర్ లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాతం డచ్చిగాం నేషనల్ పార్క్ ను సందర్శించిన బండి సంజయ**

**- నేడు పంజాబ్ వరద ప్రాంతాల్లో పర్యటించనున్న కేంద్ర మంత్రి**



అమృత్‌సర్ లోని గోల్డెన్ టెంపుల్ ను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**అమ్రుత్ సర్ అక్టోబర్ 17 తెలుగురేఖ:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం రోజున సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమ్రుత్ సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం) ను దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బండి సంజయ్ మొన్న గురువారం శ్రీనగర్ లో పర్యటించారు. ఆలిండియా జూడో పోటీల ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. ఈరోజు ఉదయం శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్ (Dachigam National Park ) ను సందర్శించారు. కాశ్మీర్ లోని అద్భుతమైన ప్రకృతి రమణీయ ప్రాంతం డచ్చిగాం నేషనల్ పార్క్. 141 చ.కిమీ ప్రాంతంలో విస్తరించి ఉన్న పార్క్ ను 1910లో నాటి మహారాజు హరిసింగ్ ఏర్పాటు చేశారు. చుట్టూ పర్వత శ్రేణులు, గలగల పారే సెలయేర్ల సవ్వడుల మధ్య తీరొక్క పూల తోటతో ఈ పార్క్ ఏర్పాటైంది. 1981లో దీనిని అధికారికంగా నేషనల్ పార్క్‌గా ప్రకటించారు. జింకల సంరక్షణకు ప్రధాన కేంద్రమిది. హంగుల్ జింక (Kashmir Stag), హిమాలయన్ నల్ల ఎలుగుబంటి, మస్క్ డీర్, హిమాలయన్ గ్రే లాంగూర్, లెపర్డ్, బార్కింగ్ డీర్, జంగిల్ క్యాట్ వంటి జంతువులు ఈ పార్క్ లో దర్శనమిస్తాయి.



శ్రీనగర్ లోని డచ్చిగాం నేషనల్ పార్క్ లో కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్

ఇంతటి కమనీయమైన నేషనల్ పార్క్ ను తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండి అనేక మంది ప్రధానులు, రాష్ట్రపతులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు సందర్శించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవించి ఉన్నంత కాలం ఇక్కడికి వచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. పలు బాలీవుడ్ దర్శకులు కాశ్మీర్ అందాలను చూపించే సినిమాలను ఇక్కడ చాలా నిర్మించారని తెలిపారు. ప్రకృతి ప్రేమకులకు స్వర్గధామంగా ఈ పార్క్ కు పేరుంది. ఇంతటి విశిష్టమైన డచ్చిగాం నేషనల్ పార్క్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు పార్క్ అంతా కలియ తిరిగారు. పార్క్ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బలగాలు 'ఆపరేషన్ మహదేవ్' పెహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన ప్రాంతానికి సమీపంలోనే ఈ పార్క్ ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర భద్రతా సిబ్బంది, జమ్మూకాశ్మీర్ పోలీసు ఉన్నతాధికారులతో కలిసి అల్పాహారం సేవించారు. అనంతరం శ్రీనగర్ నుండి అమ్రుత్ సర్ వెళ్లిన బండి సంజయ్ స్థానిక బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. బండి సంజయ్ కు స్థానిక విమానాశ్రయంలోనే ఘన స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు, బీజేపీ కార్యాలయంలో ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

అక్కడి నుండి సాయంత్రం నేరుగా సిక్కు మతస్తుల అత్యంత పవిత్ర స్థలమైన స్వర్ణ దేవాలయానికి వెళ్లారు. ఆలయ సిబ్బంది కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. వారితో కలిసి టెంపుల్ ను దర్శించుకున్న బండి సంజయ్ రాత్రి వేళల్లో బంగారపు కాంతుల్లో మెరుస్తున్న ఆలయం అద్భుత దృశ్యంగా కన్పిస్తోందని పేర్కొన్నారు.(శనివారం) పంజాబ్ లో వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను, మారుమూల గ్రామాలను సందర్శించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

# దేశ నిర్మాణం దిశగా యువతలో స్ఫూర్తిని నింపనున్న సర్దార్ @150 యూనిటీ మార్చ్

**- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**






**హైదరాబాద్, అక్టోబరు 17 తెలుగురేఖ:** సర్దార్‌ఏ150 యూనిటీ మార్చ్‌లో చురుకుగా పాలుపంచుకోవాల్సిందిగా యువతకు, విద్యార్థులకు, ప్రజా ప్రతినిధులకు, తెలంగాణ పౌరులకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ రోజు విజ్ఞప్తి చేశారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ 150వ జయంతిని స్మరించుకోవడానికి సర్దార్‌ఏ150 యూనిటీ మార్చ్‌ను మేరా యువ భారత్ (MY Bharat) పోర్టల్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. స్థానిక కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లో శుక్రవారం నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. నిస్వార్థ సేవ, ఏకత, దేశ నిర్మాణం వంటి ఆదర్శ భావనలకు సర్దార్ పటేల్ మార్గదర్శకత్వం వహించారనీ, ఈ భావనలకు ప్రతీకగా జాతీయ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల్లో యువత ముందువరుసలో నిలవాలనీ శ్రీ కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ విలీనం కావడంలో సర్దార్ పటేల్ చరిత్రాత్మకమైన పాత్రను పోషించారని శ్రీ కిషన్ రెడ్డి ముఖ్యంగా ప్రస్తావించారు. "ఆయన దార్శనికతతో, దృఢసంకల్పంతో పూనుకోకపోతే భారత్‌లో హైదరాబాద్ విలీనం సాధ్యమయ్యేదే కాదు" అని మంత్రి స్పష్టం చేశారు. సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జీవితం, నాయకత్వం అందించిన స్ఫూర్తితో జాతీయ సమగ్రత, ఏకత, యువజన భాగస్వామ్యం వంటి ఆదర్శభావనలను ఒక ఉత్సవంగా జరుపుకొనే కార్యక్రమమే సర్దార్‌ఏ150 యూనిటీ మార్చ్ అని మంత్రి అభివర్ణించారు. ఎమ్ వై భారత్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ (ఇన్‌ఛార్జి) శ్రీ అన్షుమన్ ప్రసాద్ దాస్, ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టర్ హైదరాబాద్ శ్రీ ఎం. రామకృష్ణ కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. సర్దార్‌ఏ150 యూనిటీ మార్చ్‌లో భాగంగా తెలంగాణ అంతటా యువతను భాగస్వాములను చేస్తూ రాబోయే రెండు నెలల్లో పాదయాత్రలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్‌ను సమైక్యపరచడంలో సర్దార్ పటేల్ అందించిన సుదీర్ఘ వారసత్వాన్ని గౌరవించుకొంటూ, యువజనుల్లో ఏకత, దేశభక్తి, పౌర బాధ్యత భావనలను నింపాలన్నదే ఈ కార్యక్రమం సంకల్పంగా ఉంది. దేశ నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత నుంచి ప్రేరణను పంది, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'మై భారత్' సహకారంతో 'వికసిత్ భారత్ పాదయాత్రల'ను ఏర్పాటు చేస్తోంది.

ఈ యాత్రలను దేశాభిమానాన్ని పెంచడానికీ, ఏకతను బలపరచడానికీ యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికీ దేశం నలుమూలలా నిర్వహిస్తున్నారు. ఈ దార్శనికతలో ఓ విడదీయరాని భాగమే సర్దార్‌ఏ150 యూనిటీ మార్చ్‌లు. ఇవి 'ఏక్ భారత్, ఆత్మనిర్భర్ భారత్' ఆదర్శ భావనలను యువజనులు తమ దైనందిన జీవనంలో పాటించేలా వారిలో ప్రేరణను కలిగిస్తాయి. ఈ ప్రచారోద్యమాన్ని డిజిటల్ మాధ్యమం ద్వారా ఈ నెల 6న మొదలుపెట్టారు. దీనిలో భాగంగా సామాజిక మాధ్యమాల్లో రీల్ పోటీలు, వ్యాస రచన పోటీలతో పాటు సర్దార్‌ఏ150 యువ నాయకుల కార్యక్రమం, 15 ఏళ్ల మొదలు 29 ఏళ్ల వయస్సు వారికి క్విజ్ పోటీ వంటి కార్యక్రమాలు ఉంటాయి. మొదటి దశలో ఈ నెల 31 నుంచి నవంబరు 25వ తేదీ వరకు జిల్లా స్థాయి పాదయాత్రలు చేపడుతారు. ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలోనూ వరుసగా మూడు రోజుల పాటు వీటిని నిర్వహిస్తారు. దేశంలో అన్ని జిల్లాల్లో ప్రతి రోజూ 8 నుంచి 10 కి.మీ. మేర పాదయాత్ర ఉంటుంది.

# బీసీ జేఏసీ ప్రకటించిన తెలంగాణ బంద్ ఫర్ జస్టిస్ ను జయప్రదం చేయాలి

**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ ఆరేగంటి నాగరాజు గౌడ్**



**హన్మకొండ జిల్లా, అక్టోబర్ 18, తెలుగు రేఖా:** కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బీసీ జేఏసీ ప్రకటించిన అక్టోబరు 18న జరగబోయే తెలంగాణ బంద్ ఫర్ జస్టిస్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. కాకతీయ యూనివర్సిటీలో ఉన్న అన్ని విద్యార్థి సంఘాల మద్దతుతో పోస్టర్ ఆవిష్కరణ చేసిన తదనంతరం నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కనీ విని ఎరుగని రీతిలో శనివారం రోజున జరగబోయేటటువంటి బంద్ దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలువబోతుందని యావత్ బీసీ సమాజం, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, ఉద్యోగులు, సంస్కృతిక కళాకారులు, న్యాయవాదులు మరియు జర్నలిస్టులు ఈ బంద్ కి మద్దతు ఇచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ బంద్ బీసీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని చెప్పి బీసీ కుల గణనను చేపట్టి అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ కి పంపినప్పటికీ గవర్నర్ ఆమోదం పొందకుండా ఉండిపోయింది, అక్కడితో ఆగకుండా కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను పెట్టాలనే సంకల్పంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జీవోను ఇస్తే రెడ్డి జాగృతికి చెందినటువంటి మాధవరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేసి 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదని హైకోర్టులో, సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం జరిగింది. దానిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఈ అగ్రవర్ణాల ఆధిపత్యానికి బీసీ వ్యతిరేక శక్తులకి చరమగీతం పాడే విధంగా రేపు జరిగేటటువంటి బందులో ప్రతి గ్రామంలో, మండలాల్లో, జిల్లాల్లో పెద్ద ఎత్తున బీసీ సమాజమంతా కూడా రెండున్నర కోట్ల మంది ఒక్కసారి రోడ్ల మీదికి వచ్చి ఉద్యమం చేపడితే ఎలా ఉంటదో ఈ ప్రభుత్వాలకు చలనం ఏ విధంగా రాదో బీ సీ లకు ఎట్లా రిజర్వేషన్లు సంపాదించుకోవాలో బీసీ సమాజం అంతా కూడా ఒక్కసారి ఆలోచన చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వాని ఏ విధంగా ఒప్పించదో భారత రాజ్యాంగాన్ని సవరించి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేంతవరకు కూడా ఈ యొక్క ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు దొగ్గేల తిరుపతి , కందికొండ తిరుపతి, వికలాంగుల సంఘం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు రాములు , పిఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేణు , ఎం ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి మాదిగ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి మహాసేన కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బోస్కా నాగరాజు, మహాత్మ జ్యోతిరావు పూలే సంఘం వ్యవస్థాపకులు చెల్పూరి శ్రీకాంత్ ,స్వేరో వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయి , బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు అజయ్ సింగ్, రాజశేఖర్ , అన్వేష్, పి డి ఎస్ యు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ యాదవ్, పి డి ఎస్ యు కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు వంశీ యాదవ్, డి ఎస్ ఏ కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ శివ, బి ఎస్ ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివ , పి డి ఎస్ యు కాకతీయ యూనివర్సిటీ మహిళా అధ్యక్షురాలు కావ్య, తిరుపతి ,రాకేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. SHANKARA SHARMA, H. NO-9-18/7, KRISHNANAGAR, VILLAGE BOMMAKAL, MANDAL & DISTRICT-KARIMNAGAR TELANGANA-505001, RNI No. TELTEL/2010/31853, Editor: Eldi Ravinder, telugurekha1984@gmail.com, 9963197573.